## క్లుప్తంగా

### మంగళకుంట సర్పంచ్ శారద మృతి



పిన్నిక శారద (ఫైల్)

తర్లుపాడు: మండలంలోని మంగళకుంట సర్పంచ్ పిన్నిక శారద (57) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. కొంతకాలంగా ఆమె అనారోగ్యంతో హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు, బంధువులు విచారం వ్యక్తం చేశారు. సర్పంచ్‌గా శారద ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆమె భర్త హరికృష్ణ ఐజీగా పనిచేసి పదవీ విరమణ చేసి ఉన్నారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, మార్కాపురం మాజీ ఎమ్మెల్యే, గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి కేపీ నాగార్జునరెడ్డి, ఎంపీపీ భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, జెడ్పీటీసీ వెన్న ఇందిర హనుమారెడ్డి, వైస్ సర్పంచ్ రాజేంద్రప్రసాద్, వార్డు సభ్యులు ఆమెకు నివాళులర్పించారు. ఆదివారం స్వగ్రామం మంగళకుంటలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు బంధువులు తెలిపారు.

### అయ్యప్ప స్వాములకు అన్నదానం



అయ్యప్ప స్వాములకు అన్నదానం చేస్తున్న పేర్ల సుధీర్‌కుమార్‌రెడ్డి

రాచర్ల: మండల కేంద్రమైన రాచర్ల గ్రామంలో అయ్యప్ప స్వామి మాల వేసిన వారికి శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక శివాలయంలో ఉన్న అయ్యప్ప స్వాములు, ఆంజనేయస్వామి మాలలు ధరించిన మాలధారులకు రాచర్ల గ్రామానికి చెందిన పేర్ల సుధీర్‌కుమార్‌రెడ్డి కుటుంబ సభ్యులు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గురుస్వాములు కనకచార్యులు, ఎస్.సింగరయ్య, ఎమ్.బాలకృష్ణ, యల్లా రంగస్వామి, యోగయ్య తదితరులు పాల్గొన్నారు.

### చిరు వ్యాపారులకు నోటీసులు జారీ

గిద్దలూరు రూరల్: పట్టణంలోని నంద్యాల ఒంగోలు మెయిన్ రోడ్డుకు ఇరువైపులా కొన్నేళ్ల నుంచి చిరువ్యాపారాలు కొనసాగిస్తున్న వారికి శనివారం నగర పంచాయతీ వారు నోటీసులు జారీ చేశారు. నగర పంచాయతీ పరిధిలో చిరువ్యాపారస్తులు అక్రమంగా నిర్మాణాలు చేపట్టి అనధికారికంగా వ్యాపారాలు కొనసాగిస్తున్నారని, వారం రోజుల్లో రోడ్డు పక్కన ఉన్న చిరువ్యాపారులు ఖాళీ చేయాలని కమిషనర్ డి.వెంకటదాసు నోటీసులు జారీ చేశారు. లేని పక్షంలో చట్టరీత్యా వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

### నేటి నుంచి ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలు

పొదిలి: శ్రావణి ఎస్టేట్‌లోని శ్రీలక్ష్మీ పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి జరుపుతున్నట్లు ఆలయ నిర్మాణ, నిర్వహణ కమిటీ సభ్యులు, గౌరవాధ్యక్షుడు శ్రావణి వెంకటేశ్వర్లు, అధ్యక్షుడు యక్కలి శేషగిరిరావు తెలిపారు. 3న అంకురార్పణ, 4న ధ్వజారోహణ 5న హనుమంత వాహనం, 6న గరుడ వాహనం, 7న కళ్యాణోత్సవం, 8న దివ్య మహాభిషేకం, అశ్వ వాహనం, 9న చక్రస్నానం, ద్వాదశ ఆరాధన, అన్న సమారాధన కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. దేవాలయం ప్రధాన సలహాదారులు నారాయణం మురళీకృష్ణమాచార్యులు, ఆలయ ప్రధాన అర్చకులు దీవి శ్రీకాంత్ భట్టర్, సహాయ అర్చకులు వై.రుషీకేశవాచార్యులు ఆధ్వర్యంలో పూజాధికాలు, బ్రహ్మోత్సవ కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దేవుని కృపకు పాత్రులు కావాలని కార్యదర్శి పెరుమాళ్ల భాస్కర్, కోశాధికారి శనగపల్లి నాగేశ్వరరావు కోరారు.

### బెల్ట్ షాపుపై పోలీసుల దాడి

పెద్దదోర్నాల: మండల పరిధిలోని పెద్దబొమ్మలాపురంలో బెల్ట్ షాపుపై ఎస్సై మహేష్ శనివారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతమ్మ అనే మహిళ వద్ద విక్రయానికి సిద్ధంగా ఉన్న 21 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

# ఆటకు చోటేదీ..!



ఓ వైపు విద్యార్థులు ఆడుకుంటుండగా మైదానంలో తిరుగుతున్న పందులు



తరగతి గదులను ఆనుకొని ఉన్న పెద్దపెద్ద గుంతలు

- మైదానం అభివృద్ధి పట్టని విద్యాశాఖ
- విద్యార్థుల క్రీడలు ఓ వైపు.. పందుల స్వైరవిహారం మరో వైపు
- చిల్లచెట్లు, వ్యర్థాలతో నిండిపోతున్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం
- ఏళ్ల తరబడి నిరుపయోగంగా పడి ఉన్న అదనపు తరగతి గదులు



చిల్లచెట్ల మధ్య నిరుపయోగంగా ఉన్న భవనాలు

కంభం: మార్కాపురం డివిజన్‌లోనే విశాలమైన క్రీడామైదానంగా ఉన్న కంభం ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానం ఓ వైపు ఆక్రమణలతో కుంచించుకుపోగా మిగిలి ఉన్న మైదానంలో సగభాగం చిల్లచెట్ల వ్యర్థాలతో నిండిపోయింది. దీంతో విద్యార్థులు ఆడుకోవడానికి అనువైన స్థలం లేక అవస్థలు పడుతున్నారు. గతంలో ఇదే మైదానంలో రాష్ట్ర స్థాయిలో క్రికెట్ టోర్నమెంట్స్, ఇతర టోర్నమెంట్ లు నిర్వహించే వారు. విశాలమైన ఈ మైదానాన్ని మినీస్టేడియంగా మార్చాలన్న ప్రతిపాదనలు గతంలో రాగా ఆ తర్వాత అవి ఆచరణకు నోచుకోలేదు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలతో పాటు ప్రభుత్వ జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల ఇదే మైదానంలో ఉంది. సుమారు వెయ్యి మంది వరకు విద్యార్థులు ఇక్కడ చదువుకుంటున్నారు. వీరందరూ ఇదే మైదానంలోకి వచ్చి ఆడుకుంటారు.

**నిరుపయోగంగా ఉన్న భవనాలు:**

మైదానంలో ఓ వైపు సుమారు 15 ఏళ్ల క్రితం రూ.10 లక్షలు వెచ్చించి అదనపు తరగతి గదులు నిర్మించేందుకు పనులు మొదలు పెట్టి 70శాతం పూర్తయిన తర్వాత అర్థాంతరంగా నిలిపివేశారు. ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్న ఆ గదులు మందుబాబులకు, అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిపోయాయి. గదుల లోపల పలువురు యువకులు గంజాయి, సిగరెట్లు, మద్యం తాగేందుకు వినియోగించుకుంటున్నారు. గదుల లోపల మొత్తం కాల్చిపడేసిన సిగరెట్లు, మందు సీసాలు, వ్యర్థాలతో నిండి పోయింది. కొంత నిధులు ఖర్చు పెట్టి వాటి నిర్మాణం పూర్తి చేస్తే విద్యార్థులకు ప్రయోజనకరంగా ఉంటుంది.

**అడవిని తలపిస్తున్న మైదానం:**

మైదానం చుట్టూ పిచ్చి చెట్లు, చిల్లచెట్లు పెరిగి చిన్నపాటి అడవిని తలపిస్తోంది. చుట్టుపక్కల నివాసం ఉండే ప్రజలు వ్యర్థాలను, మురుగు నీటిని సైతం మైదానంలోనే వదిలేస్తున్నారు. పందులు స్వైరవిహారం చేస్తుండటంతో విద్యార్థులు ఆడుకోడానికి ఇబ్బందులు పడుతుండగా ఉదయం, సాయంత్రం వాకింగ్ కు వచ్చే వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సమీపంలోని కొందరు మైదానాన్ని బహిర్భూమికి వినియోగించుకుంటుండటంతో మైదానం మరింత అధ్వానంగా మారిపోతుంది. మైదానంలో మరో వైపు తరగతి గదుల నిర్మాణం కోసం పునాది గుంతలు తీసి నిర్మాణాలను మరో చోటికి మార్చారు. కానీ పెద్ద పెద్ద గుంతలను అలాగే వదిలేయడం విద్యార్థులకు ఇబ్బందికరంగా మారింది. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకొచ్చినా గుంతలు పూడ్చడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. మండల విద్యాశాఖాధికారే ఈ పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడిగా ఉన్నప్పటికీ పాఠశాల మైదానం అభివృద్ధిపై దృష్టి సారించకపోవడం విమర్శలకు తావిస్తోంది. విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి మైదానం అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.



మైదానంలో ఉదయం పూట వాకింగ్ చేస్తున్న ప్రజలు

# ప్రతిభకు ప్రోత్సాహం

- ఎడ్యుకేషనల్ ఎపిఫనీ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభ పరీక్షలు
- ఏటా 9 లక్షల రూపాయల నగదు బహుమతులు

మార్కాపురం: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను, పోటీతత్వాన్ని, ప్రతిభను వెలికితీసేందుకు ఎడ్యుకేషనల్ ఎపిఫనీ స్వచ్ఛంద సంస్థ రాష్ట్ర వ్యాప్తంగా డిసెంబర్ 29న ప్రిలిమినరీ పరీక్ష నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో 7,10 తరగతులు చదువుతున్న విద్యార్థులకు 12 ఏళ్లుగా ఈ సంస్థ పరీక్ష నిర్వహిస్తోంది. ఒక్క రూపాయి ఫీజు లేకుండా తమకు ఇష్టమైన చోటు నుంచే ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహిస్తున్నారు. నవంబర్ 14 లోపు పూర్తి చేసిన దరఖాస్తులను https://www.educationalepiphany.org/eemt2024/registrations2024.php లింకు ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందులో విద్యార్థి పేరు, మొబైల్ నెం, తల్లిదండ్రుల ఈ మెయిల్, పుట్టిన తేదీ, చిరునామా తదితర వివరాలు నమోదు చేయాలి.

**సిలబస్ ఇలా..**

ఏటా 9 లక్షల రూపాయల నగదు బహుమతులు విద్యార్థులకు అందిస్తున్న ఈ సంస్థ ప్రతినిధులు ఈ పరీక్షను రెండు దశల్లో నిర్వహిస్తారు. ప్రిలిమ్స్, మెయిన్స్ విభాగాల్లో పరీక్ష ఉంటుంది. విద్యార్థులు ఇంటి నుంచి లేదా పాఠశాల నుంచి హాజరు కావచ్చు. కోడ్ తంత్ర అనే సాఫ్ట్‌వేర్ ద్వారా పరీక్ష నిర్వహిస్తారు. డిసెంబర్ 29న జరిగే ప్రిలిమినరీ పరీక్షలో 40 శాతం పైబడి మార్కులు పొందిన వారు మెయిన్ పరీక్షకు అర్హులవుతారు. వచ్చే ఏడాది జనవరి 19న మెయిన్స్ పరీక్ష నిర్వహిస్తారు. దానిలో 50 శాతం మార్కులు పొంది ఆన్‌లైన్ నిబంధనలు కచ్చితంగా పాటించిన వారికి బహుమతులు ఇస్తారు. రాష్ట్ర అకడమిక్ క్యాలండర్ 2024–25 సిలబస్‌ను అనుసరించి డిసెంబరు నాటికి పూర్తయిన సిలబస్‌పై 80 శాతం జనరల్ నాలెడ్జ్‌పై 20 శాతం ప్రశ్నలు ఉంటాయి. ఇంకా సైన్సు, సోషల్, గణితం, జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్‌పై ప్రశ్నలుంటాయి. ప్రిలిమ్స్ పరీక్షలో 60 ప్రశ్నలకు 100 మార్కులు, మెయిన్స్‌లో కూడా 60 ప్రశ్నలకు 100 మార్కులుంటాయి. వీటిలో తేలికపాటి ప్రశ్నలకు 1 మార్కు, మధ్యరకం ప్రశ్నలకు 2 మార్కులు, కఠినమైన వాటికి మూడు మార్కులు ఇస్తారు.



దూదేకుల నబీ, రాష్ట్ర కో ఆర్డినేటర్

**బహుమతులు ఇలా..**

రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే ఈ పరీక్షల్లో 162 మందిని ఎంపిక చేసి దాదాపు 9 లక్షల రూపాయల విలువైన నగదు బహుమతులను విద్యార్థులకు అందించనున్నారు. రాష్ట్రస్థాయిలో పదో తరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించిన విద్యార్థులకు 30, 25, 20 వేల రూపాయలు ఇస్తారు. రాష్ట్రస్థాయిలో 7వ తరగతిలో ఫస్టు, సెకండ్, థర్డ్ వచ్చిన విద్యార్థులకు 20, 15, 10 వేలు ఇస్తారు. జిల్లాస్థాయిలో మొదటి మూడు స్థానాల్లో విజేతలైన విద్యార్థులకు 8,6,4 వేల రూపాయలు, 7వ తరగతి విద్యార్థులకు 5,4,3 వేల రూపాయలు ఇస్తారు. మండల స్థాయిలో గెలుపొందిన విజేతలకు కూడా బహుమతులు, ప్రశంసపత్రాలు ఇస్తారు.

**విద్యార్థులను ప్రోత్సహించేందుకే:**

దూదేకుల నబీ, రాష్ట్ర కో ఆర్డినేటర్

విద్యార్థులను ప్రోత్సహించేందుకే ఏటా ఆన్‌లైన్‌లో 7,10 తరగతులు చదువుతున్న విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్నాం. డాక్టర్ తవనం వెంకటరావు అధ్యక్షునిగా ఉన్న ఈ సంస్థ ఆధ్వర్యంలో 12 ఏళ్లుగా పోటీలు నిర్వహిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా నగదు బహుమతులు ఇస్తోంది. ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు ప్రోత్సహించాలి. వివరాలకు 95731 39936, 63032 93502 నంబర్లను సంప్రదించాలి.

## ప్రభుత్వ స్థలాలను ప్రజాప్రయోజనాలకు వినియోగిస్తాం

- డీఎస్పీ నాగరాజు



మాట్లాడుతున్న డీఎస్పీ నాగరాజు, పక్కన సీఐ, కమిషనర్

మార్కాపురం టౌన్: మార్కాపురం పురపాలక సంఘం పరిధిలోని కొండెపల్లి రోడ్డులో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని ప్రజలందరికి ఉపయోగకరంగా ఉండే నిర్మాణాలు చేపడతామని డీఎస్పీ నాగరాజు అన్నారు. శనివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయనతో పాటు సీఐ సుబ్బారావు, కమిషనర్ నారాయణరావులు మాట్లాడారు. సర్వే నంబరు 343లోని 224.79 చ.మీ గల విస్తీర్ణంలోని స్థలాన్ని ఏ సామాజిక వర్గానికి చెందిన వారికి కేటాయించడం లేదని, ప్రజలు ఎవరూ ఆందోళన చెందవద్దన్నారు. కొన్ని రోజులుగా ఈ స్థలంపై వివిధ రకాల పుకార్లు వ్యాపించినందున ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అక్కడ ఉన్న హిందూ, ముస్లిం మత పెద్దలతో మాట్లాడగా వారు ఆ స్థలంలో ఏ విధమైన ప్రార్థన మందిరాలు, ఇతర కట్టడాలు చేయబోమని తీర్మానించి తెలిపారన్నారు. మున్సిపాల్టీ ఆధీనంలో అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడే విధంగా చూడగలమని, దీనికి సంబంధించి ఎలాంటి పుకార్లను నమ్మవద్దని పోలీసు, మున్సిపల్ అధికారులు పట్టణ ప్రజలకు తెలిపారు.

## మెడికల్ కాలేజీ పనులు ప్రారంభించాలి



నిర్మాణంలో ఉన్న మెడికల్ కాలేజీ వద్ద రంగసాయిరెడ్డి

మార్కాపురం: మెడికల్ కాలేజీ పనులను త్వరితగతిన ప్రారంభించాలని ప్రజా సంకల్ప వేదిక రాష్ట్ర అధ్యక్షుడు మదిరె రంగసాయిరెడ్డి కోరారు. వెనుకబడిన ప్రకాశం జిల్లాలోని మార్కాపురం, గిద్దలూరు, యర్రగొండపాలెం, కనిగిరి, పొదిలి నియోజకవర్గాల ప్రజలకు ఉపయోగకరంగా ఉండే మెడికల్ కళాశాలను రాయవరం వద్ద సుమారు 50 ఎకరాల్లో నిర్మిస్తున్నారు. మెడికల్ కళాశాల పనులను వేగవంతంగా పూర్తి చేసి అందుబాటులోనికి తేవాలని ఆయన కోరారు. స్థానిక జిల్లా వైద్యశాలలో వసతులు, పూర్తిస్థాయి సిబ్బంది లేకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందన్నారు. గత రాష్ట్ర ప్రభుత్వం మార్కాపురం ప్రాంతంలో వైద్యకళాశాలను మంజూరు చేసింది. వైద్యకళాశాల, కిడ్నీ రీసెర్చ్ సెంటరు, సూపర్ స్పెషాలిటీ వైద్యశాల ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికోసం 500 కోట్ల రూపాయలతో అంచనాలు రూపొందించిందన్నారు. ప్రభుత్వం చొరవ తీసుకొని మెడికల్ కళాశాల పనులు త్వరితగతిన పూర్తి చేసి మెడికల్ కళాశాలను పూర్తిస్థాయిలో అందుబాటులోనికి తేవాలని ఆయన కోరారు.

## గిన్నిస్‌బుక్ అవార్డు గ్రహీత స్వప్నికకు సన్మానం



స్వప్నికను సన్మానిస్తున్న మాదిగ ఉద్యోగ సంఘ నాయకులు

మార్కాపురం: పట్టణానికి చెందిన కొండేపోగు స్వప్నిక క్రోచెట్స్ (అల్లికల)లో ఇటీవల గిన్నీస్ బుక్ ఆఫ్ రికార్డ్సు సాధించారు. ఈ సందర్భంగా గిన్నిస్ బుక్ అవార్డు గ్రహీత స్వప్నికను మార్కాపురం మాదిగ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాదిగ ఉద్యోగుల సంఘ జిల్లా వైస్ ప్రెసిడెంట్ బి.జీవరత్నం, పట్టణ ప్రెసిడెంట్ ఎం.ఏలియా, సెక్రటరీ ఆర్.సంజీవరావు, కోశాధికారి ఎం.ప్రసాద్, మెంబర్లు సీఎస్ కుమార్, పందీటి కాశీరావు, గౌరవ అధ్యక్షుడు అనోజ్‌రావు, వైస్ ప్రెసిడెంట్ కొండయ్య, రిటైర్డు ఎమ్మార్వో జి.జైపాల్, ఎంఈఎఫ్ఎం, ఆర్పీఎస్, ఎంఎస్పీ కార్యవర్గ సభ్యులు, స్వప్నిక కుటుంబ సభ్యులు పాల్గొని అభినందించారు.

### భక్తిశ్రద్ధలతో కార్తీక మాస పూజలు



కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

మార్కాపురం టౌన్: కార్తీక మాసం ప్రారంభం సందర్భంగా శనివారం శివాలయంతో పాటు పట్టణంలోని పలు ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు స్నానాలు ఆచరించి శివాలయానికి వెళ్లి కార్తీక దీపాలు వెలిగించారు. ఆలయంలో పలువురు భక్తులు అభిషేకాలు అర్చకులు ఆంజనేయశర్మ, వరుణ్ తేజ, అర్చక బృందం నిర్వహించింది. మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం ఆలయం ఆవరణలో మహిళలు కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. శివలింగం, జగదాంబ అమ్మవారిని అర్చకులు ప్రత్యేకంగా అలంకరించి రుద్రాభిషేకం, కుంకుమార్చన చేశారు. ఈవో చెన్నకేశవరెడ్డి, సిబ్బంది భక్తులకు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

### జార్జి కళాశాలలో ఘనంగా ఆల్ సోల్స్ డే

మార్కాపురం: స్థానిక జార్జి ఇంజినీరింగ్ కళాశాలలో ఆల్ సోల్స్‌డే కార్యక్రమంలో వ్యవస్థాపకులకు జార్జి విద్యాసంస్థ సభ్యులు ఘనంగా నివాళులర్పించారు. సామ్యూల్ జార్జి ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, ఎస్‌జీఐపీ ప్రిన్సిపాల్, సిబ్బంది డాక్టర్ ఆదిమూలపు శామ్యూల్ జార్జి, చెరుకూరి థెరీసమ్మలకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జార్జి గ్రీన్స్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆర్‌సీఎం ఫాదర్ జాన్, అరెమ్, సిస్టర్స్, ప్రిన్సిపాల్స్ డాక్టర్ రాజబాబు, డాక్టర్ రాజా జయరావు, అకడమిక్ డీన్ డాక్టర్ మస్తానయ్య, హెచ్‌ఓడీలు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, జార్జి విద్య సంస్థలు సిబ్బంది పాల్గొన్నారు.



ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న జార్జి కళాశాలల సిబ్బంది

### 18వ రోజుకు చేరిన కాంట్రాక్టు కార్మికుల నిరసన దీక్ష

మార్కాపురం టౌన్: మార్కాపురం పురపాలక సంఘ కార్యాలయంలో తొలగించిన కాంట్రాక్టు కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ డిమాండ్ చేశారు. పురపాలక సంఘ కార్యాలయం ఎదుట కాంట్రాక్టు కార్మికులు నిర్వహిస్తున్న నిరసన దీక్ష శనివారానికి 18వ రోజుకు చేరింది. ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్యాలయంలో దాదాపు 20 నుంచి 25 ఏళ్లుగా పనిచేస్తున్న కార్మికులను తొలగించడం అన్యాయమన్నారు. ప్రభుత్వం చిరుద్యోగులపై తమ ప్రతాపం మానుకొని కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకపోగా కూటమి ప్రభుత్వం తమను అక్రమంగా తొలగించి తమ ఉపాధిని కోల్పోయేలా చేశారన్నారు. సుబ్బరాయుడు, ఇమాంసా, చెన్నకేశవులు, జి.హరి, శ్రీను, కనకయ్య పాల్గొన్నారు.

### కోతకు గురైన రోడ్డు



గరిమినపెంట సమీపంలో కోతకు గురైన మట్టి రోడ్డు

కొనకనమిట్ల: మండలంలోని గరిమినపెంట నుంచి వెలుగొండ్రాయునిపల్లి ఎస్సీ కాలనీకి వెళ్లే రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు కోతకు గురైంది. దీంతో గరిమినపెంట నుంచి వెలుగొండ్రాయునిపల్లి ఎస్సీ కాలనీ, గొట్లగట్టు వరకు వెళ్లే వారికి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ట్రాక్టర్, ఆటోలు ఆ రోడ్డున రావాలంటే ఇబ్బందులు పడాల్సి వస్తోందని వాహనదారులు వాపోతున్నారు. వర్షం పడితే మరింత ఇబ్బందిగా ఉంటుందన్నారు. వర్షం పడినప్పుడు తరుచూ కోతకు గురవుతుందని, అధికారులు స్పందించి కోతకు గురైన చోట శాశ్వత మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. అలాగే గరిమినపెంట సమీపంలోని వాగు వద్ద చప్టా నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

### స్నేహితుడికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న మిత్రులు

తర్లుపాడు: తీవ్ర అనారోగ్యంతో మంచం నుంచి కదలలేని స్థితిలో ఉన్న మిత్రునికి 10వ తరగతి పూర్వవిద్యార్థుల మిత్ర బృందం ఆర్థిక సాయం అందించింది. మండలంలోని చెన్నారెడ్డిపల్లికి చెందిన గట్ల బాలకాశిరెడ్డి కొంతకాలంగా అనారోగ్యంతో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న పదో తరగతి మిత్రులు శనివారం కాశిరెడ్డి ఇంటికి వెళ్లి పరామర్శించి 20 వేల రూపాయల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుధాకర్‌తో పాటు తర్లుపాడులోని జెడ్పీ పాఠశాలలో 1996–97 విద్యా సంవత్సరం పదో తరగతి చదువుకున్న విద్యార్థులు పాల్గొన్నారు.

### ఆధార్ సర్వీసులు అందక ఇక్కట్లు

కంభం: కందులాపురం సచివాలయం పరిధిలో శనివారం ఆధార్ కార్డుల్లో మార్పులు, చేర్పుల కోసం వచ్చిన విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆపరేటర్ కు సమావేశం ఉందని, ఇవాళ చేయడం కుదరదని చెప్పడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. కాలేజీలు మానుకొని నాలుగైదు రోజుల నుంచి వస్తున్నామని, అయినా పనులు జరగడం లేదని వారంతా అసహనం వ్యక్తం చేశారు. సమస్యను ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన తిరిగి ఆధార్ సర్వీసులు ప్రారంభించారు. కంభం, అర్థవీడు, బేస్తవారిపేట మండలాల్లో ఆధార్ సెంటర్లు పనిచేయక పోవడంతో సమస్య అధికంగా ఉందని ప్రజలు వాపోతున్నారు.



అసహనం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు